# మొరిగే కుక్క

ఏలేశ్వరపు విజయలక్ష్మి

అప్పలమ్మ జీవితంలో ఊహించనిది తను రచయిత్రి కావడం. సింహాచలంలో పుట్టి, విశాఖపట్టణంలో, శ్రీకాకుళం, ఆముదాలవలస, మద్దువలస, కంభవలసల్లో పెరిగినప్పుడు కూడా అప్పలమ్మ తన పేరుగురించి ఎప్పుడూ ఆలోచించలేదు.

అప్పలమ్మ వయసుకి మించి ఒడ్డూ పొడుగూ పెరిగిపోయి పుచ్చపండులా నవనవలాడి పోవడం చూసి వాళ్ళమ్మ దడుసుకుని చదువు మాన్పించేసింది. ఏ కుర్రవెధవ ఏ లెగ్ బ్రేక్ వేస్తాడోనన్న భయమే దానిక్కారణం.

ఖాళీగా కూర్చోవడం ఇష్టంలేక ముగ్గులు వేయడం మొదలుపెట్టింది. పక్కింటి పైడిమాలక్ష్మి "ఊరికే అలా ముగ్గుమీద ముగ్గెట్టి మురిసి పోతావుగాని ఏదన్నా పత్రిక్కి పంపించు" అని సలహా ఇచ్చింది.

అప్పలమ్మ ముగ్గు పత్రిక్కి పంపింది. అది 'తోకలేని పడవ'లో అచ్చయింది. ఆ ముగ్గుని మెచ్చుకుంటూ పది ఉత్తరాలు తనే రాసుకుంది తోచిన పేర్లతో. అందులో రెండుత్తరాలు అచ్చయినాయి.

మళ్ళీ ముగ్గు తీసుకొని పత్రికాఫీసుకు వెళ్ళింది అప్పలమ్మ. 'తోకలేని పడవ' ఎడిటరు "వెధవ ముగ్గులెందుకు?కథరాయండి" అన్నాడు.

ఆ క్షణంలో తనని వరించిబోతున్న రచయిత్రి స్థానాన్ని చూసి ప్రముఖ రచయిత్రి "మల్లెమొగ్గల దీపాలరాణి" స్థాయిలో ఊహించేసుకుంది.

అష్టకష్టాలు పడి ఒక కథని రాసి పట్టుకెళ్ళింది. ఆ కథని మరో రచయితతో దిద్దించి ప్రచురించాడు ఎడిటర్ శంభులింగం. పారితోషికం వంద రూపాయలు ఇచ్చాడు. అప్పలమ్మ పేరుని "కుమారి వడ్లగింజల అప్పలరాణి'గా మార్చాడు శంభులింగం.

ఎర్రగా బుర్రగా నిగనిగలాడిపోతూ, పిటపిటలాడిపోతున్న అప్పలరాణి కథలు వరుసగా వేయడం మొదలు పెట్టాడు శంభులింగం.

పత్రికాఫీసుల చుట్టూ తిరగడం మొదలెట్టాక అప్పలరాణికి మరికొందరు రచయితలతో పరిచయం పెరిగింది. పోను పోను అప్పలరాణి 'టంగ్'ని చూసిన శంభులింగం భయపడి పోయాడు.

ఎదురుగా నవ్వుతూ మాట్లాడి పక్కకి తిరగ్గానే పక్కవాడి గురించి నోటికొచ్చినట్లు మాట్లాడ్డం అప్పలరాణికున్నలవాటు.

"తోకలేని పడవ" లో ప్రముఖ రచయితగా పేరు పొందిన 'ఈరన్న భూపతి' అప్పలరాణి నోటికి బలయిపోయాడు.

"అసలు ఈరన్నకి రాయడం రాదు, ఇంగ్లీషు పుస్తకాలు కాపీ కొడతాడు." అని ఓ మీటింగులో చెప్పింది.

కొందమంది కాలేజీ పిల్లలు తనని చూడటానికి వచ్చినప్పుడు "పొరపాట్నకూడా మీరు ఈరన్నని కలవకండి, ఆడపిల్లల పిచ్చెక్కువ అతనికి" అంది అకారణంగా అతని ప్రసక్తి తీసుకొచ్చి.

"మీకెలా తెల్సు?" ఓ అమ్మాయి అడిగింది ఆశ్చర్యంగా.

"ఎలా తెలుసేమిటి? అందరికీ తెలిసిందే."

అంతనితో మాట్లాడితేనే ఆడపిల్లల మానాలు పోతాయన్నంత గ్యారంటీగా అంది అప్పలరాణి.

"మిమ్మల్ని కూడా..." అనుమానంగా అడిగింది ఇంకో అమ్మాయి.

"అతని మనస్సులో ఏముందుకానీ, ఏ మాటకామాట చెప్పుకోవాలి. అతనెలాంటి వాడైనా నా దగ్గర మార్యాదగానే వుంటాడు" అందంగా నవ్వేసింది అప్పలరాణి.

"అయితే మీకోసం ట్రై చేయలేదన్నమాట!" ఓ అమ్మాయి నీరుగారిపోయినట్టుగా వ్యంగ్యంగా అడిగింది.

వచ్చినవాళ్ళు ఈర్షన ఫాన్స్‌ని అప్పలరాణికి తెలియదు. తన పాతివ్రత్యాన్ని నలుగురికి చెప్పుకోడానికి గాను అవతల వ్యక్తిని గురించి అంత దారుణంగా మాట్లాడుతోందని వాళ్ళు గ్రహించారు.

తనగురించి అప్పలరాణి నోరు పారేసుకుందని విని చిద్విలాసంగా నవ్వాడు ఈరన్న భూపతి.

అతను అప్పలరాణి ఇంటికి స్వయంగా వచ్చాడు. ఆమెని కథలు మానేసి నవలలు రాయాలని చెప్పాడు. తను ఎంకరేజ్ చేస్తానని మాటిచ్చాడు. తననించి ఏ విధమైన లాభం పొందకుండా అతనెందుకు సాయం చేస్తానన్నాడో అంతుచిక్కలేదు.

ఈరన్నతో చర్చించి రెండు నవళ్ళు రాసింది. ఆ రెండింటిని రెండు పత్రిక్కల్లో సీరియల్స్‌గా మొదలెట్టించాడు ఈరన్న. అప్పలరాణి స్థాయి మరోమెట్టు ఎదిగింది. తనచుట్టూ సర్కిల్ పెరిగిపోయిందన్నధీమాతో ఎవరిని పడితే వాళ్ళని సాహిత్యం గురించి తెలియని బ్రూట్స్ అనే పరిస్థితికి వచ్చేసింది.

అయితే ఈరన్న చేసిన సాయంతో పైకి వచ్చానని చెప్పుకోడం నామోషీగా ఫీలయిపోయి ఈరన్న రాసిన "భూమి బద్దలయింది" నవలతానే రాసానని చెప్పుకోవడం మొదలెట్టింది.

అది విని కూడా ఈరన్న భూపతి చిద్విలాసంగా నవ్వేడు. "అరిచే కుక్కకి ముందు రెండు బిస్కట్లు పడేయ్యాలి. అటు తరువాత అదును చూసి మున్సిపాలిటీ బండిలో పడేయ్యాలి. అదే నా లాజిక్" అన్నాడు.

అతని బుర్రకి శంభులింగం సైతం ఖంగ్ తిన్నాడు. అప్పలరాణి ఎర్రని రంగుని, ఒడ్డు పొడుగు చూసి కానీ కట్నం లేకుండా పెళ్ళిచేసుకున్నాడు గుర్రాల వెంకటేశ్వరరావు.

శోభనం గదిలో ముద్దూముచ్చట కోసం ఎదురుచూస్తున్న జి.వి. రావుకి అప్పలరాణి తన రచనా జీవితం గురించి చెప్పుకుంది. ఈరన్నని తదితర రచయితల్ని దుయ్యబట్టింది.

ఓపికగా విన్నాడు జి.వి.రావు.

"ఈ కథ ఎలావుందో చెప్పరూ!" అని తనురాయబోయే నవల ఇతివృత్తాన్ని వినిపించబోయింది. అప్పటికే సహనాన్ని పూర్తిగా కోల్పోయాడు గుర్రాల వెంకటేశ్వరరావు.

"అసలు నీ కథలు ఎలా పబ్లిష్ అవుతున్నాయ్" అడిగాడు జి.వి. రావు.

అప్పలరాణి గర్వంగా చూసింది.

"అదేమిటి? ఈరన్న భూపతి లాంటి రచయితే నా కథల్ని మెచ్చుకుంటాడు" అంది.

పత్రికాఫీసుకు వెళ్ళింది అప్పలమ్మ. 'తోకలేనిపడవ' ఎడిటరు "వెధవ ముగ్గులెందుకు కథరాయండి" అన్నాడు. ఆ క్షణంలో తనని వరించబోతున్న రచయిత్రి స్థానాన్ని "మల్లె మొగ్గల దీపాల రాణి" స్థాయిలో ఊహించేసుకుంది.



"ఈరన్న భూపతా? వాడిగురించి నాకంతా తెల్సు. వాడితో నీకు పరిచయం ఉందా?"

"అందరి విషయం వేరు— నా దగ్గర చాలా మర్యాదగా ఉంటాడు."

ఆ మాటలు పూర్తికోలేదు. శోభనం గది గుర్తులా వెంకటేశ్వరరావు కొట్టిన చెంపదెబ్బతో అదిరిపోయింది.

ఆమె చిన్న గాడిదపిల్లలా నోరు తెరిచి ఏడవడం మొదలు బెట్టింది. జి.వి. రావు గదిలోంచి విసురుగా వెళ్ళిపోయాడు.

శోభనం గదిలో పడక సుఖం సంగతి మర్చిపోయి కథలు చెప్పడం మొదలు బెట్టేసరికి అల్లుడుగారు పారిపోయారన్న వార్త గుప్పుమంది.

మర్నాడు ఈరన్న భూపతి అప్పలరాణి గోడు విన్నాడు. అతను విద్వేలాసంగా నవ్వాడు. ఆ నవ్వులో వెటకారం. ఓ గెలుపూ కనబడుతున్నాయి.

"మొరిగే కుక్కకి రెండు బిస్కట్లు వేయాలి. అటు తరువాత సమయం చూసి మునిసిపాలిటీ బండిలో పడేయ్యాలి" అతని అతని మాటలు అతనికే గుర్తుకు వచ్చాయి.

జి.వి. రావు జాడ అప్పలరాణికి మరి కానరాలేదు *